సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం ၊ 7 ၊ అక్టోబర్ ၊ 2023



అప్పులు, వివాహేతర బంధంతోనే అంతం?

అప్పులు, వివాహేతర సంబంధమే హెడ్ కానిస్టేబుల్ ఆత్మహత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా తేల్చారు. -8లో



బైక్‌ల అధిక శబ్దానికి బ్రేక్

రాజంపేట పట్టణంలో పెద్ద పెద్ద సౌండ్స్‌తో బైకులను నడుపుతూ ఇబ్బంది పెడుతుండడంతో అర్బన్ సీఐ నరసింహారావు సైలెన్సర్లు తొలగించి రోడ్డు రోలర్‌తో తొక్కించారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.8/25.3

జిల్లాలో శుక్రవారం 25.3 - 34.8 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.7 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

పోస్టల్ ఎస్పీగా రాజేష్



కడప వైఎస్ఆర్ సర్కిల్: తపాలా శాఖ వైఎస్సార్ జిల్లా సూపరింటెండెంట్‌గా జి.రాజేష్ నియమితులయ్యారు. ఈయన కర్నూలు పోస్ట్ మాస్టర్ కార్యాలయంలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. రెండు నెలల కిందట ఇక్కడ పని చేస్తున్న గౌస్ ఆజామ్ పదవీ విరమణ పొందడంతో ఇన్‌ఛార్జ్‌గా బద్వేలు పోస్ట్ మాస్టర్ కిరణ్ కొనసాగారు. సాధారణ బదిలీలలో భాగంగా జి.రాజేష్‌ను కడప పోస్టల్ సూపరింటెండెంట్‌గా నియమించారు.

మైదుకూరులో వాలీబాల్ సమరం



కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా మైదుకూరు పట్టణంలోని మేధా డిఫెన్స్ అకాడమీ క్రీడా మైదానం వేదికగా అండర్–17 బాలబాలికల రాష్ట్ర స్థాయి పోటీల నిర్వహణకు రంగం సిద్ధమైంది. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు జరిగే ఈ పోటీలకు 13 జిల్లాల నుంచి క్రీడాకారులు హాజరుకానున్నారు. క్రీడాకారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణ కుమారి తెలిపారు. వివిధ జిల్లాల క్రీడాకారులకు కడప, యర్రగుంట్ల రైల్వే స్టేషన్లలో బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. టోర్నమెంట్‌కు నియమించిన వ్యాయామోపాధ్యాయలు వారి విధులను చక్కగా నిర్వహించి విజయవంతం చేయాలని ఆమె కోరారు.

జేఎన్టీయూలో 2కె23 సదస్సు



టు కె 23 సదస్సు ప్రారంభిస్తున్న వేణుగోపాల్‌రెడ్డి, తదితరులు

పులివెందుల రూరల్: పట్టణంలో మూడు రోజుల పాటు 'నేషనల్ లెవల్ స్టూడెంట్ టెక్నికల్ ప్రోగ్రాం యంత్ర 2కె23 సదస్సు' నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని జేఎన్టీయూ కళాశాలలో 2కె 23 సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ జిల్లాల నుంచి 600 మంది విద్యార్థులు పాల్గొన్నారని, వారికి డ్రోన్ టెక్నాలజీ ఎలక్ట్రిక్ వెహికల్స్, త్రీడీ ప్రింటింగ్ టెక్నాలజీపై అవగాహన కల్పిస్తామన్నారు. యూసీఐఎల్ ప్రాజెక్టు అధికారి ఎం.ఎస్‌రావు మాట్లాడుతూ యురేనియం ప్రాముఖ్యత గురించి, తయారీ విధానం గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ నారాయణరెడ్డి, రాజీవ్ కుమార్, కృష్ణ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

దసరాకు ప్రత్యేక బస్సులు

మదనపల్లె సిటీ: దసరా పండుగ సందర్భంగా బెంగళూరు,హైదరాబాద్‌లకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ–1 డిపో మేనేజర్ మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ప్రయాణికులు ఆన్‌లైన్‌లో టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకోవాలన్నారు. సాధారణ చార్జీలతో దసరా స్పెషల్ బస్సులు నడపుతామన్నారు. టిక్కెట్లు కావాల్సిన వారు 7382875034 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

డివిజనల్ పీఆర్వోగా సునీల్‌సాగర్



కడప సెవెన్‌రోడ్స్: సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ఏపీఆర్వోగా విధులు నిర్వర్తిస్తున్న కె.సునీల్ సాగర్ డివిజనల్ పీఆర్వోగా పదోన్నతి పొందారు. శుక్రవారం కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతిపై పనిచేసిన జిల్లాలో బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అనుగుణంగా విధులు నిర్వర్తిస్తానన్నారు. ఏఐఐఈ శ్రీనివాసరావు, డివిజనల్ పీఆర్వో మస్తాన్ సాహెబ్, పీఆర్వో రవికుమార్, ఏపీఎస్ నాగయ్య, ముని ప్రసాద్, సిబ్బంది సునీల్ సాగర్‌ను అభినందించారు.

8న షూటింగ్‌బాల్ జట్ల ఎంపిక

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం నిమ్మనపల్లెరోడ్డులోని వశిష్ట స్కూలులో ఈనెల 8న జిల్లా షూటింగ్ బాల్ సబ్ జూనియర్ జట్ల ఎంపిక జరుగుతుందని అసోసియేషన్ జిల్లా కార్యదర్శి నరేష్‌బాబు తెలిపారు. క్రీడాకారులు 01.04.2007 తరువాత పుట్టి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకు రావాలన్నారు.ఎంపికైన వారు పీలేరు మండలం కె.వి.పల్లిలో జరుగు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారన్నారు.

ప్రకృతి సేద్యం.. రాబడే లక్ష్యం

రైతులు రసాయన అవశేషాలు లేని పంటలు పండించేలా.. వ్యవసాయంలో పెట్టుబడి ఖర్చులు తగ్గించేలా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. జిల్లాలో ప్రకృతి సేద్యం వైపు రైతులు అడుగులు వేస్తున్నారు. అధికారులు సహకారం అందిస్తూ రైతులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కృషి చేస్తున్నారు.

- పురుగుమందు లేని ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు
- అంతర పంటలుగా కూరగాయల సాగుకు రైతుల ఆసక్తి
- పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా చర్యలు
- డ్వాక్రా సంఘాల సభ్యులతో విత్తన కిట్ల తయారీ



పులివెందులలో నిమ్మతోట మధ్య అంతర పంటలుగా ఉల్లి, కూరగాయల సాగు

కడప అగ్రికల్చర్: ఒకవైపు రైతులు వ్యవసాయంలో లాభాలు పొందేలా.. మరోవైపు ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఈ ఏడాది 62040 మంది రైతులతో 93982 ఎకరాలలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు సాగు చేయించాలని వ్యవసాయాధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయి సిబ్బంది వరకు కృషి చేస్తున్నారు. ఇప్పటికే 40912 మంది రైతులతో 56228 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. అంతర్ పంటలు సాగు చేసేందుకు వీలుగా 41875 సీడ్ కిట్లు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగానే 15,453 సీడ్ కిట్లు ఇప్పటికే రైతులకు అందజేసింది. ప్రభుత్వం ఇందుకోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించింది. ఆర్బీకేల పరిధిలో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో దాదాపు పది వేల ఎకరాల్లో అంతర పంటలు సాగయ్యాయి. ప్రధాన పంట సాగుకు అయిన ఖర్చులో కూరగాయల సాగు ద్వారా కొంత రాబడిని సాధిస్తున్నారు. సరిహద్దు పంటల సాగుతో చీడపీడల బెడద తగ్గిపోతోంది.

కొనేందుకు వినియోగదారుల ఆసక్తి

సహజ సేద్య విధానంలో సాగు చేసిన కూరగాయలు తినడంతో ఆరోగ్యం మెరుగుపడుతుండడంతో ప్రజలు ఉత్పత్తులు కొనేందుకు ఆసక్తి చూపుతున్నారు. కషాయాలతో పండించిన ధాన్యానికి మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. అధికంగా ప్రధాన పంటలైన దానిమ్మ, అరటి, మామిడి, బత్తాయి, నిమ్మ, సపోటాతోపాటు ఉద్యాన, వ్యవసాయ పంటల్లో అంతర్ పంటలుగా ముల్లంగి, కార్యెట్, బీట్‌రూట్, మటిక, వంగ, సజ్జ, మొక్కజొన్న, కంది, బీర, సొర, చిక్కుడు వంటివి ప్రకృతి వ్యవసాయంలో రైతులు సాగు చేస్తున్నారు. ఈ పంటలు మార్కెట్లోకి వచ్చిన వెంటనే వినియోగదారులు పోటీ పడి కొనుగోలు చేస్తున్నారు. తమ ఆరోగ్యం బాగా మెరుగుపడుతుందని చెబుతుండటంతో డిమాండ్ పెరుగుతుంది.

జిల్లాలో ప్రకృతి వ్యవసాయం కింద రైతులు, పంటల సాగు విస్తీర్ణం వివరాలివీ..

డివిజన్	సాగు చేసిన రైతుల సంఖ్య	సాగైన విస్తీర్ణం
బద్వేల్	3375	3757.78
కడప	6591	7827.79
కమలాపురం	1262	2561.47
ముద్దనూరు	4823	9081.46
మైదుకూరు	5389	7379.16
పోరుమామిళ్ల	5731	7485.7
ప్రొద్దుటూరు	2621	3686.49
పులివెందుల	10210	14448.56
మొత్తం	40002	56228.41

మహిళలతో విత్తన కిట్ల తయారీ

గ్రామాల్లో డ్వాక్రా సంఘంలో ఉండి ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళలకు బ్యాంకుల ద్వారా పెట్టుబడి ఖర్చులకు రుణసౌకర్యం కల్పిస్తున్నారు. అ డబ్బుతో విత్తన కిట్లు సిద్ధం చేసి ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు విక్రయిస్తున్నారు. మహిళలు కొంత ఆర్థిక స్వావలంబన సాధించడమే గాక, రైతులకు ఆసరాగా నిలుస్తున్నారు. కల్తీలేని విత్తనాలను రైతులకు అందిస్తూ మహిళలు సాగును ప్రోత్సహిస్తున్నారు. అవగాహన ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తూ రైతులు సలహాలు, సూచనలు అందిస్తూ అడుగులు వేస్తున్నారు.



రైతుకు కిట్లు అందజేస్తున్న మహిళలు

అంతర పంటగా కూరగాయల సాగు



చీనీ పంటలో అంతర పంటగా తీగజాతి కూరగాయలు సాగు చేస్తున్నా. ఇపుడు ఏపుగా పెరిగి ఓ మాదిరి చెట్లు అయ్యాయి. త్వరలో కాపునకు వస్తే కొంత రాబడి వస్తుంది. ప్రధాన పంటలసాగు ఖర్చులో కొంత ఖర్చు తగ్గించుకోవచ్చు.
– బాలమునెయ్య, తొండూరు

రైతులను ప్రోత్సహిస్తున్నాం



ప్రధాన పంటల సాగులో అంతర్ పంటగా కూరగాయలు, ఆకుకూరలు, తీగ కూరలు సాగు చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నాం. ప్రధాన పంట దిగుబడి వచ్చే లోపు కూరగాయల పంటల దిగుబడి వస్తుంది.
– రామకృష్ణంరాజు, జిల్లా మేనేజర్, ప్రకృతి వ్యవసాయం

రైతులకు అవగాహన



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరావు

కడప అగ్రికల్చర్: ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించేందుకు సిబ్బంది కృషి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి అయితా నాగేశ్వరావు సూచించారు. కడపలోని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కారాలయంలో వ్యవసాయ సిబ్బందితో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో శనగ పంటను రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లో శనగ విత్తనం రాయితీపై అందిస్తామని తెలిపారు. ఏటీఎం మోడల్స్‌కు సంబంధించి కూరగాయలసాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగు విస్తీర్ణం పెంచాలన్నారు. సిబ్బందికి నిర్దేశించిన లక్ష్యాలను ఎప్పటికప్పుడు సాధించే విధంగా పర్యవేక్షించాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు మాట్లాడుతూ శనగ ఉత్పత్తులకు టీటీడీ ద్వారా మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సాధికారత సంస్థ సీనియర్ కన్సల్టెంట్ సరేంద్రరెడ్డి, అదనపు జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వసంతకుమారి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, డిపిఎంయు స్టాఫ్ పాల్గొన్నారు.

క్రాంగెస్ నేత దురుసు ప్రవర్తన

కడప వైఎస్ఆర్ సర్కిల్: నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఓ ఛానల్ విలేకరిపై కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్ శుక్రవారం దురుసుగా ప్రవర్తించారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడప ఉక్కు పరిశ్రమపై జరుగుతున్న ర్యాలీని కవరేజ్ చేస్తున్న ఛానల్ రిపోర్టర్‌ను గౌతమ్ ప్రక్కకు లాగి దురుసుగా ప్రవర్తించాడు. దీంతో సభ వద్ద ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో జర్నలిస్టులు నిరసన తెలపడంతో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రంరాజు కాంగ్రెస్ పార్టీ తరపున క్షమాపణ కోరారు.

ప్రత్యేక హోదాతోనే రాష్ట్రాభివృద్ధి

పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు




ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పేర్కొన్నారు. 'కడప ఉక్కు ఏమైంది' అంశంతో నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఏడు రోడ్ల కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో రుద్రరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని విభజన చట్టంలో ప్రత్యేక హోదా, ఉత్తరాంధ్ర, రాయలసీమ బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ, జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు, పోలవరం ప్రాజెక్టు, సెంట్రల్ యూనివర్శిటీ ఏర్పాటు హామీలు కాంగ్రెస్ పార్టీ ఇవ్వడం జరిగిందన్నారు. అధికారంలో ఉన్న భాజపా ప్రభుత్వం అవేవీ అమలు చేయకుండా కాలయాపన చేయడం దారుణమన్నారు. ఉక్కు పరిశ్రమకు కావాల్సిన నిధులు, నీరు, ఖనిజాలు పుష్కలంగా ఉన్నా భాజపా ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే తొలి సంతకం ప్రత్యేక హోదా మీద చేస్తామని తమ అధినేత రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో అనేక మార్లు తెలిపారన్నారు. అక్టోబర్ 21న మంత్రాలయంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పల్లంరాజు, ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్, పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జంగా గౌతమ్, నాయకులు విష్ణుప్రీతం రెడ్డి, నజీర్ అహ్మద్, బండి జకరయ్య, అహ్మద్, ఆలీఖాన్, చెప్పలి పుల్లయ్య, చార్లెస్, లక్షుమయ్య పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడితే చర్యలు

- ప్రపంచ కప్ పోటీల నేపథ్యంలో ప్రత్యేక నిఘా
- జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్



పోలీసుల సమస్యలను వింటున్న ఎస్పీ సిద్దార్థ్ కౌశల్

కడప అర్బన్: అమాయక ప్రజలు, యువకులను లక్ష్యంగా చేసుకుని, ఎక్కువగా డబ్బు సంపాదించవచ్చని ఆశలు రేకెత్తించేలా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసం చేయాలని చూస్తే ఊరుకునేది లేదని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ హెచ్చరించారు. ఐసీసీ క్రికెట్ ప్రపంచకప్–2023 నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక పోలీస్ బృందాలు ఏర్పాటుచేసి నిఘా పెంచామని తెలిపారు. అమాయకుల బలహీనతలను ఆసరాగా చేసుకుని ఎవరైనా క్రికెట్ బెట్టింగ్‌లకు పాల్పడినా, ప్రోత్సహించినా ఉపేక్షించబోమన్నారు. ఏపీ జూద చట్టం ప్రకారం కేసులు నమోదు చేయడమేగాక, కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని, సస్పెక్ట్ షీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందన్నారు. బెట్టింగ్ సమాచారాన్ని డయల్ 100కు సమాచారమివ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా వుంచుతామన్నారు. శ్రమించకుండా వచ్చే నగదు వెనుక నష్టాలుటాయని, యువత గుర్తించాలన్నారు. యువత బెట్టింగ్‌రాయుళ్ల వలలో పడకుండా అప్రమత్తంగా వుండాలని ఎస్పీ సూచించారు.

పోలీసుల సమస్యలను పరిష్కరిస్తాం

జిల్లాలో సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ పేర్కొన్నారు. కడపలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లు, ఆయా విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితమ సమస్యలు ఎస్పీకి విన్నవించారు. బదిలీలు, వ్యక్తిగత, స్పౌస్, చిల్డ్రన్స్, మెడికల్ సమస్యల గురించి 25 మంది వివరించారు. సిబ్బంది సమస్యలను విన్న ఎస్పీ తగిన పరిష్కారం చూపుతామని భరోసా కల్పించారు.

చారిత్రక భవనం.. పునర్నిర్మాణం

- రూ. 60 లక్షల అంచనా వ్యయం
- పంచాయతీరాజ్ ఆధ్వర్యంలో పనుల పర్యవేక్షణ



పాత కలెక్టరేట్ భవనం (ఫైల్)

కడప సెవెన్‌రోడ్స్: చారిత్రక వారసత్వ భవనమైన పాత కలెక్టరేట్ మళ్లీ మహర్దశ పడుతోంది. భవనానికి నూతన సొబగులు దిద్ది వినియోగంలోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆలనా పాలనా లేక పాడుబడిపోయే దశకు చేరడంతో రూ.60 లక్షలతో పునర్నిర్మాణ పనులు చేపట్ట సున్నారు.

- 1889లో పాత కలెక్టరేట్ భవనాన్ని నిర్మించినట్లు గెజిట్ ద్వారా తెలుస్తోంది. ఈ భవన నిర్మాణానికి ఆ కాలంలో రూ.2.50 లక్షలు ఖర్చు చేశారు. నాటి మద్రాసు ప్రెసిడెన్సీలో అందమైన చర్చిలను నిర్మించిన ప్రభుత్వ ఆర్కిటెక్ట్ చిషోమ్ ఈ భవనానికి రూపకల్పన చేశారు. వైఎస్సార్ జిల్లా కలెక్టరేట్‌ను గతంలో ఈ భవనంలో నిర్వహించారు. అయితే నూతనంగా నిర్మించిన కొత్త కలెక్టరేట్‌ను 2016 ఏప్రిల్, 20న ప్రారంభించారు. అయతే పాతభవనాన్ని ఎవరూ పట్టించుకోలేదు. ఇక్కడే వన్‌టౌన్ పోలీస్ స్టేషన్, సర్వేయర్ల భవనానికి స్థలం కేటాయించడంతో ఆవరణంతా కుదించుకుపోయింది. ఆటోలు, మున్సిపాలిటీ చెత్త వాహనాలు, ప్రైవేటు వాహనాల పార్కింగ్ స్థలంగా మారిపోయింది. చెత్తాచెదారం నిండి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ఈ చారిత్రక భవనానికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ సంస్థలు చాలాకాలంగా డిమాండ్ చేశాయి.



భవనంలో పనులు చేస్తున్న కూలీలు

నూతన రూపు

పాత కలెక్టరేట్ రూపు రేఖలు మారనున్నాయి. రూ.60 లక్షల అంచనా వ్యయంతో భవనం పునర్నిర్మించనున్నట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో డీఈ మురళి, ఏఈ వీరాంజనేయులురెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం రూ.5 లక్షలు విడుదల చేయడంతో భవనం పైకప్పుపై చెట్లు, వేర్లు, మూడు వరండాల పైకప్పు తొలగించే పనులు జరుగుతున్నాయి. కిందిభాగం దెబ్బతినకుండా జాగ్రత్తగా పనులు చేపడుతున్నారు. విరిగిపోయిన దంతెలకు మరమ్మతులు చేస్తున్నారు. భవనంపై నెర్రెలకు సిమెంట్ పూత వేస్తున్నారు. ఆవరణలో కొన్ని చెట్లు తొలగించి పునర్నిర్మిస్తే భవనం మళ్లీ వినియోగంలోకి వస్తుందని భావిస్తున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మహిళలు

రైల్వేకోడూరు: శెట్టిబలిజలను బీసీల్లో చేర్చడం సంతోషమని, ఇందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని బొజ్జవారిపల్లె గ్రామ మహిళలు పేర్కొన్నారు. శుక్రవారం సర్పంచ్ మావిళ్ల సుబ్బయ్య, మాజీ సర్పంచ్ మావిళ్ల సుబ్రమణ్యం, ఉప సర్పంచ్ దాడిశెట్టి సిద్దు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి చిత్రపటానికి మహిళలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొజ్జవారిపల్లె గ్రామంలో శెట్టిబలిజలు 200 కుటుంబాలు ఉన్నాయని, వీరంతా బీసీల్లోకి చేరడం వల్ల విద్య, ఉద్యోగ, ప్రభుత్వ పథకాల పరంగా లబ్ధి చేకూరుతుందని, భవిష్యత్ ఉన్నతంగా ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీలు నెరవేరుస్తూ పేదల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారన్నారు. ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హరిప్రసాద్, తుపాకుల వెంకట సుబ్బయ్య, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం



కడప: శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో వైద్యం చేయించుకుని మందులు తీసుకుంటున్న ప్రజలు

23 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

కడప రూరల్: ప్రభుత్వ ఆదేశాలతో జిల్లా యంత్రాంగం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ఆయా ప్రాంతాల్లో ప్రజలు పోటెత్తుతున్నారు. ఈ శిబిరాల ద్వారా ఉచిత సేవలను పొంది ఊరట పొందుతున్నారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 23 కేంద్రాల్లో మెడికల్ క్యాంపులు జరిగాయి. కడప నగరం పాత కడపలో జరిగిన శిబిరంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, టీటీడీ బోర్డు సభ్యుడు మాసీమ బాబు, స్థానిక కార్పొరేటర్లు, ముద్దనూరు మండల పరిధిలోని వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన శిబిరాలకు ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, తిప్పలూరులో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు హాజరయ్యారు. పెండ్లిమర్రి మండలం గుర్రాల చింతలపల్లెలో జేసీ గణేష్‌కుమార్ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ ఉచిత వైద్య శిబిరాలు తమకు మెరుగైన ఆరోగ్యం చేకూరుస్తున్నాయని ప్రజలు తెలిపారు.

అప్పులు, వివాహేతర బంధంతోనే అంతం?

- షేర్ మార్కెట్‌లో భారీగా నష్టాలు
- తన సమస్యను చెప్పకుండా దాచిన వైనం
- సహజీవనం చేస్తున్న మహిళ నుంచి ఒత్తిళ్లు
- హెడ్‌కానిస్టేబుల్ ఉదంతంపై ప్రాథమిక దర్యాప్తులో వెల్లడి

ఆయనో హెడ్‌కానిస్టేబుల్.. కుటుంబానికి కూడా హెడ్ (యజమాని). వారిని కంటికి రెప్పలా కాపాడాల్సింది పోయి.. మృగంలా మారాడు. తన సమస్యలు పరిష్కరించుకోలేక.. కుటుంబాన్నే అంతం చేసుకున్నాడు. భార్యాపిల్లలను చంపి.. తానూ ఆత్మహత్య చేసుకున్న ఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. అప్పులు, వివాహేతర సంబంధమే ఇందుకు కారణాలని పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.



హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ (ఫైల్)



జిల్లా ఎస్పీగా పని చేసిన వి.సి.సజ్జనార్‌తో గ్రూప్ ఫొటో దిగిన కుమార్తెలు, హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్ (ఫైల్)



బెంగళూరు కాలేజీలో లాస్యకు అశ్రు నివాళి

కడప అర్బన్ : కడప నగరంలో ఓ హెడ్ కానిస్టేబుల్ తన భార్య, ఇద్దరు కుమార్తెలను బుధవారం రాత్రి పిస్టల్‌తో కాల్చి తానూ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లాలో తీవ్ర విషాదం నింపిన విషయం తెలిసిందే. ఇది గురువారం ఉదయం వెలుగు చూసిన సంగతీ విదితమే. షేర్ మార్కెట్ ద్వారా రూ.లక్షలు పోగొట్టుకుని అప్పుల పాలయ్యాడని, మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగించడం వలనే అతను ఇంతటి ఘాతుకానికి ఒడిగట్టాడని పోలీసులు ప్రాథమిక దర్యాప్తులో తేల్చారు. కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ టి. వెంకటేశ్వర్(51) రైటర్‌గా విధులు నిర్వర్తిస్తుండే వారు. ఆయన మంచితనానికి మారుపేరుగా, వృత్తిలో నిబద్ధతగా పని చేసేవారని పేరు తెచ్చుకున్నాడు. ఆయనకు భార్య మాధవి(47) తోపాటు డిగ్రీ చేస్తున్న లాస్య(21), పదో తరగతి చదువుతున్న అభిజ్ఞ(16) అనే ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. బుధవారం రాత్రి తన అభిజ్ఞను ట్యూషన్ నుంచి ఇంటికి తీసుకుని వచ్చాడు. తర్వాత మరలా స్టేషన్ వెళ్లి స్ట్రాంగ్‌రూంలోని పిస్తోల్‌ను తన వెంట తెచ్చుకున్నాడు. వారి ఇంటిలో ఏనాడూ గొడవలు జరగకపోవడంతో తమను చంపుతాడని భార్య,పిల్లలకు ఏమాత్రం తెలీదు. అలాంటి తరుణంలో కుటుంబ యజమాని హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్ కొన్ని గంటల వ్యవధిలోనే మృగంలా మారాడు. తన భార్య, పిల్లలను తానే చేతులారా చంపుతున్నానని మరచిపోయాడు. వారు నిద్రిస్తున్న సమయంలో పెద్ద కుమార్తె లాఖిన్య అలియాస్ లాస్యను మొదట నుదిటిపై కాల్చాడు. ఆమె కొనఊపిరితో వుందని భావించి ఛాతీపై కాల్చాడు. రెండవ కుమార్తె అభిజ్ఞ, భార్య మాధవిలను కూడా వారి నుదిటిపైనే పాయింట్ బ్లాంక్‌లో కాల్చేశాడు. చివరగా తాను కణతపై కాల్చుకుని మరణించాడు. నాలుగు మరణాలకు కారణం కేవలం వెంకటేశ్వర్ చేసుకున్న అప్పులు, వీటితోపాటు రమాదేవితో వివాహేతర సంబంధమేనని తెలుస్తోంది.

హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్‌కు షేర్ మార్కెట్‌లో డబ్బులు పెట్టే అలవాటుంది. దీంతో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి పోగొట్టుకున్నాడు. కొన్నేళ్ల క్రితం తన సోదరుడు హైదరాబాద్ నుంచి వచ్చి దాదాపు రూ.20 లక్షలు తీర్చి వెళ్లారు. ఈ ఏడాది జనవరిలో ఓ బ్యాంక్‌లో రుణం కూడా తీసుకున్నాడని సమాచారం. అంతేగాక పలువురి నుంచి అప్పులు తీసుకుని వారికి చెక్కులు, బాండ్లు ఇచ్చాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో తన తల్లి మరణించిన సమయంలో అంత్యక్రియలను జరిపించేందుకు డబ్బులు లేకపోవడంతో సహచర సిబ్బంది ద్వారా తీసుకున్నాడు. అలాగే కొన్నేళ్ల క్రిందట రమాదేవితో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఆమెతో సహజీవనం చేసేవాడు. ఆమె కూడా తనకు తెలిసిన వారు, బంధువుల దగ్గర అప్పు చేసి డబ్బులను ఇప్పించింది. ఆర్థిక సమస్యలున్నా, మరో మహిళతో సహజీవనం చేసినా భార్య, పిల్లలను ఏనాడూ నిర్లక్ష్యం చేయలేదు. రమాదేవితో వివాహేతర సంబంధం వున్న విషయం తోటి కానిస్టేబుళ్లకు కూడా తెలీదు. ఏనాడూ సిబ్బందికి ఆర్థిక సమస్యల గురించి చెప్పలేదు. సోదరుడు, సోదరి హైదరాబాద్, బెంగళూరులో స్థిరపడ్డారు. బంధువులంతా ఆర్థికంగా బాగున్నారు. ఇటీవలి కాలంలో బంధువుల నుంచి క్షేమ సమాచారాలు లేవు. దీంతో వెంకటేశ్వర్ ఆర్థిక పరిస్థితి గురించి వారికి తెలియదు. ఆర్థిక సమస్యలతోపాటు రమాదేవి నుంచి ఒత్తిళ్లు వుండటంతో, వాటన్నింటిని మనసులో పెట్టుకుని ఎవరికీ చెప్పుకోలేక, తనతోపాటు తన కుటుంబాన్ని బలి తీసుకున్నాడు.



హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్, భార్య మాధవి మృతదేహాలు

అన్యాయంగా కుటుంబాన్ని..

'సమస్య తనదైనపుడు అభం శుభం తెలీని భార్యాపిల్లలను ఎందుకు చంపాలి. అదేదో తానొక్కడే చనిపోయి వుంటే.. కుటుంబమైనా బాగా వుండేది కదా' అని అందరూ చర్చించుకుంటున్నారు. సమస్యలను భార్యాపిల్లల దగ్గర కానీ, స్నేహితుల వద్ద కానీ చర్చించకపోవడం ప్రధాన కారణంగా తెలుస్తోంది. 'స్నేహితులకో, బంధువులకో చెప్పి వుంటే ఎవరైనా సాయం చేసేవారు కదా.. ఎంతో అన్యోన్యంగా వున్న కుటుంబాన్ని ఎందుకు పొట్టన పెట్టుకున్నాడు' అని స్థానికంగా అంటున్నారు. ఈ ఘటన జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

నలుగురి మృతదేహాలకు అంత్యక్రియలు పూర్తి

హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్, భార్య, ఇద్దరు పిల్లల మృతదేహాలకు పోలీసులు కడప రిమ్స్‌లో సిటీ స్కానింగ్ చేయించారు. పిస్టోల్ ద్వారా కాల్చిన తరువాత సదరు బుల్లెట్‌లు ఎంత మేరకు శరీరంలోకి దిగబడ్డాయో తెలుసుకునేందుకు సిటీ స్కానింగ్ చేయించారు. తరువాత పోస్టుమార్టం చేయించారు. బంధువులకు మృతదేహాలను అప్పగించారు. పోలీసు అధికారులు, బంధువులు.. మృతదేహాలకు శుక్రవారం మోచంపేటలోని శ్మశాన వాటికలో దహన సంస్కారాలు నిర్వహించారు. చివరిచూపు చూసేందుకు కడప టూటౌన్ సీఐ సయ్యద్ హాసం, ఎస్‌ఐలు జయరాముడు, సంజీవరాయుడు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షుడు దూలం సురేష్, ఉపాధ్యక్షుడు ఉప్పుశంకర్ తదితరులు వచ్చి, మృతదేహాలకు నివాళులు అర్పించారు. హైదరాబాద్, బెంగుళూరులలో స్థిరపడ్డ వారి బంధువులు వచ్చి అంత్యక్రియలలో పాల్గొన్నారు. మరోవైపు బెంగుళూరులో పెద్ద కుమార్తె లాఖిన్య అలియాస్ లాస్య చదువుతున్న డిగ్రీ కళాశాలలో విద్యార్థులు అశ్రు నివాళి అర్పించారు.



లాస్య, అభిజ్ఞ మృతదేహాలు

రిమ్స్ ఐసీయూలో పని చేయని ఏసీలు

కడప అర్బన్ : కడప నగర శివారులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) ఐసీయూలో ఏసీలు పని చేయకపోవడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా జనరల్ మెడిసిన్‌తోపాటు, ఇతర ప్రధాన విభాగాలలో క్లిష్ట పరిస్థితిలో వుండే రోగులకు మెరుగైన వైద్య సేవలను అందించాలంటే ప్రత్యేకంగా ఎంఐసీయూ, ఏఎంసీ వార్డులను ఉపయోగిస్తుంటారు. ఆయా వార్డులలో 24/7 వేళల్లో రోగులకు అత్యవసర పరిస్థితి వుంటుంది కాబట్టి వైద్యులు నిరంతరం అందుబాటులోనే వుండి, వైద్య సేవలను అందిస్తుంటారు. ఆక్సిజన్ నిరంతర సరఫరాతోపాటు వెంటిలేటర్‌పై రోగులకు అత్యవసర సేవలను అందిస్తారు. ప్రాణాపాయ స్థితిలోనే ఎక్కువ మంది రోగులు ఇక్కడ వైద్యసేవలను పొందుతుంటారు. పై పరికరాలతో పాటు, వైద్యులు తమ శాయశక్తుల వైద్య సేవలను అందించినప్పటికీ నిబంధనల మేరకు.. ఆయా వార్డుల్లో ఏ/సీ సౌకర్యం తప్పనిసరిగా వుండాలి. 2006లో రిమ్స్ స్థాపించిన సమయంలో సెంట్రల్ ఏ/సీ విధానం ఏర్పాటు చేశారు. కాలక్రమేణ వాటి నిర్వహణ బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. ఈ ప్రైవేట్ ఏజెన్సీ నిర్వాహకుడు నామమాత్రంగా వచ్చి సెంట్రల్ ఏ/సీకి మరమ్మతులు చేయించడం, నాలుగు రోజులకే మరలా చెడిపోవడం జరుగుతోంది. మరోవైపు ఎంఐసీయూ, ఏఎంసీ విభాగాల్లో శుక్రవారం దాదాపు 19 మంది పేషెంట్లు అత్యవసర పరిస్థితుల్లో వైద్య సేవలను పొందుతున్నారు. వారికి ఆక్సిజన్, వెంటిలేటర్ల సౌకర్యాలతో, ఆధునిక పరికరాలతో వైద్య సేవలను అందిస్తూ, వైద్యుల పర్యవేక్షణలో వున్నారు.



ఏసీలు పనిచేయక అవస్థలు పడుతున్న రోగులు, సహాయకులు

ఐతే, సెంట్రల్ ఏ/సీ కానీ, వున్న ఏ/సీ పరికరాలు కానీ పనిచేయక పోవడం గమనార్హం. ఏఎంసీ విభాగంలో మాత్రం ఒకే ఒక్క ఏ/సీ పని చేస్తోంది. మిగతా అన్ని బెడ్ల వద్ద ఫ్యాన్‌లు మాత్రమే తిరుగుతున్నాయి. ఫ్యాన్‌లు తిరగని, లేని చోట్ల తమకు దగ్గరగా వున్న కిటికీలను తెరిచి మరీ గాలి వచ్చేలా చేసుకుంటున్నారు. కొంత మంది పేషెంట్ల బంధువులను పలుకరించగా.. తీవ్ర అవస్థలు పడుతున్నట్లు వారు తెలిపారు.

ప్రతిపాదనలు పంపించాం

కడప రిమ్స్ ప్రారంభించిన సమయంలో ఏర్పాటు చేసిన సెంట్రల్ ఏ/సీ పరికరాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించాలని డీఎంఈకి ప్రతిపాదనలు పంపించాం. జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా ఈ ఫైల్‌ను తీసుకుని వెళ్లాం. త్వరలోనే ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తాం.

– డాక్టర్ రమాదేవి, సూపరింటెండెంట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్), కడప

తెలుగుగంగ రిజర్వాయర్‌లో వ్యక్తి గల్లంతు

మైదుకూరు : తెలుగు గంగ రిజర్వాయర్‌లో కుమార్తెను కాపాడబోయి.. తండ్రి గల్లంతయ్యాడు. మైదుకూరు మండలంలో శుక్రవారం చోటు చేసుకున్న ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని గంజికుంట పంచాయతీ ఏకర్లపాలెం గ్రామానికి చెందిన శ్రీనునాయక్ (35) తన 12 ఏళ్ల కుమార్తె జ్యోతితో కలిసి తెలుగుగంగ రిజర్వాయర్-2 (డి.బండ్)లోకి ఉదయాన్నే చేపల వేటకు వెళ్లాడు. ఇద్దరు తెప్పపై వెళుతుండగా.. తెప్పలో పాము కనిపించింది. పామును చూసి బాలిక భయంతో తండ్రిని గట్టిగా పట్టుకుంది. తెప్ప కుదుపులకు గురికావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. కుమార్తెను రక్షించే ప్రయత్నంలో శ్రీనునాయక్ రిజర్వాయర్‌లో గల్లంతయ్యాడు. అదే సమయంలో మరో తెప్పలో చేపల వేటకు వచ్చిన అదే గ్రామానికి చెందిన సురేష్, రమేష్ అనే వారు బాలికను రక్షించారు. అనంతరం వారు గ్రామస్తులకు, రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. రిజర్వాయర్‌లో శ్రీనునాయక్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అతనికి భార్య అరుణ, ఆరేళ్ల కుమారుడు ఉన్నారు. ప్రస్తుతం అతని భార్య నిండు గర్భవతి అని తెలుస్తోంది.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : అవమానభారంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన చోటుచేసుకుంది. మదనపల్లె జన్మభూమికాలనీకి చెందిన వెంకటరమణ కుమార్తె గాయత్రి(26) సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా పని చేస్తోంది. ఇటీవల వరలక్ష్మి వ్రతం సందర్భంగా ఆమె బంధువుల ఇంటికి వెళ్లింది. అక్కడ బంధువుల ఇంట్లో బంగారు గొలుసు చోరీకి గురైంది. అయితే ఈ విషయంలో గాయత్రిపై వారు అనుమానం వ్యక్తం చేయడంతో.. తీవ్ర మనస్తాపంతో గురువారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యకు యత్నించింది. ఆమెను కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

కుటుంబ సమస్యలతో ఇద్దరు..

వేర్వేరు ప్రాంతాల్లో కుటుంబ సమస్యలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మదనపల్లెలోని రామారావు కాలనీకి చెందిన శ్రీనివాసులు భార్య ఎం.అంజలి(32)కుటుంబ సమస్యలతో ఎలుకల నివారణ మందు తిని గురువారం రాత్రి ఆత్మహత్యకు ప్రయత్నించింది. బి.కొత్తకోట బీసీ కాలనీకి చెందిన వెంకటస్వామి కుమారుడు వెంకటరమణ(35) కుటుంబ సమస్యలతో శుక్రవారం పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబ సభ్యులు 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిద్దెపై నుంచి జారిపడి వ్యక్తి మృతి

మదనపల్లె : మునక్కాయలు కోసేందుకు మిద్దెపైకి వెళ్లి ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన శుక్రవారం పట్టణంలో జరిగింది. బసినికొండ అగ్గిపెట్టల ఫ్యాక్టరీ సమీపంలో నివాసం ఉంటున్న రమణ కుమారుడు టి.శ్రీనివాసులు(45) సొంతంగా కారు పెట్టుకుని డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో తనకు బాగా తెలిసిన వ్యక్తులు అమెరికా నుంచి వస్తుండటంతో వారి ఇంటిలో గ్యాస్ సిలిండర్ పెట్టి వచ్చేందుకు అన్న సుబ్రహ్మణ్యంతో కలిసి రెడ్డెప్పనాయుడు కాలనీలోని ఇంటికి వెళ్లాడు. అక్కడ గ్యాస్ సిలిండర్ ఉంచిన తర్వాత ఇంటి ప్రాంగణంలో మునగచెట్టు విపరీతంగా కాయలు కాసి ఉండటంతో.. తన ఇంటికి మునక్కాడలు తీసుకెళదామని భావించాడు. అన్న సుబ్రహ్మణ్యంను కిందనే ఉండాలని చెప్పి మిద్దెపైకి వెళ్లి వంగి చెట్టులో కాయలు కోయడం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో కాయలు కోస్తూ ప్రమాదవశాత్తు మిద్దెపై నుంచి జారి కిందకు పడ్డాడు. ప్రమాదంలో తలకు తీవ్రగాయం కావడం విపరీతమైన రక్తస్రావంతో అపస్మారక స్థితికి చేరుకున్నాడు. ఊహించని ఘటనతో షాక్‌కు గురైన అన్న సుబ్రహ్మణ్యం తేరుకుని స్థానికుల సాయంతో ఆటోలో శ్రీనివాసులును జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శ్రీనివాసులు మృతి చెందాడని నిర్ధారించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌ల అధిక శబ్దానికి బ్రేక్



సైలెన్సర్లను రోడ్‌రోలర్‌తో తొక్కించేస్తున్న సీఐ, ఎస్‌ఐ, పోలీసులు

రాజంపేట : రాజంపేట పట్టణంలో కొంత మంది యువత పెద్దపెద్ద సౌండ్స్‌తో బైకులను నడుపుతూ ప్రజలను ఇబ్బంది పెట్టడం అధికమైంది. వీరికి పోలీసులు బ్రేక్ వేశారు. శుక్రవారం అర్బన్ సీఐ నరసింహారావు నేతృత్వంలో పట్టణ ఎస్‌ఐ ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో.. శబ్దకాలుష్యం చేసే బైకులను గుర్తించేందుకు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా ఎస్పీ, డీఎస్పీ ఆదేశాల మేరకు ఈ దాడులు చేపట్టామన్నారు. కొంత మంది ప్రత్యేకించి పెద్దగా సౌండ్ వచ్చేందుకు సైలెన్సర్లు పెట్టుకొని తిరుగుతున్నారన్నారు. మొదటిసారిగా వారి బైకులు ఉన్న సైలెన్సర్లను పీకివేశామన్నారు. వాటిని రోడ్‌రోలర్‌తో తొక్కించామన్నారు. మరోసారి ఇలాగే ప్రవర్తించే వారిపై క్రిమినల్ కేసులు పెట్టి, బైకులను సీజ్ చేస్తామన్నారు. రోడ్డు రవాణా నిబంధనల ప్రకారం అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పట్టణ పోలీసులు పాల్గొన్నారు.

పాముకాటుతో రైతు మృతి

ముద్దనూరు : మండలంలోని ఉప్పలూరు గ్రామంలో గోవిందు లక్ష్మయ్య(45) అనే రైతు పాము కాటుకు గురై మృతి చెందాడు. సీఐ నరేష్ బాబు సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. గోవిందులక్ష్మయ్య గురువారం తన పొలంలో గడ్డికోస్తుండగా పాము కరిచింది. వెంటనే అతన్ని చికిత్స నిమిత్తం ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు.